క్లుప్తంగా

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు అభినందనలు



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను అభినందిస్తున్న ఏపీ ఎన్‌జీఓ సంఘం నాయకులు

ఏలూరు(మెట్రో) : జిల్లాల విభజనలో భాగంగా నూతనంగా ఏర్పడిన ఏలూరు జిల్లా సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ఎన్‌జీఓ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన జిల్లా ఏర్పడి సంవత్సర కాలం విజయవంతంగా నిర్వహించినందుకు కలెక్టర్‌కు అభినందనలు తెలిపి, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సహాయ సహకారాలతో ఏడాది పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించినట్టు చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ ఎన్జీఓ సంఘ నాయకులకు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పశ్చిమగోదావరి జిల్లా ఏపీఎన్జీఓ సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, నోరి శ్రీనివాస్, మాదాసు సాంబశివరావు, కప్పల సత్యనారాయణ, కేఎస్‌ఆర్ మోహన్, జి.రవికుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు కె.నాగమణి, సునీత, సత్యభారతి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల వినతి



ఈపీడీసీఎల్ ఎస్‌ఈకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని విద్యుత్ సంస్థ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యుత్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.సాల్మన్ రాజును కోరారు. ఈ మేరకు గురువారం సాల్మన్ రాజును స్థానిక విద్యుత్ భవన్‌లో కలిసిన సంఘ నాయకులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. విశ్రాంత ఉద్యోగులకు తప్పనిసరిగా ఒకటో తేదీనే పింఛను అందజేయాలని, అనేక రకాల ఆరోగ్య సమస్యలతో ఉన్న విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. దీనిపై ఎస్‌ఈ సాల్మన్ రాజు సానుకూలంగా స్పందిస్తూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి తమ వంతు పూర్తి సహకారం అందజేస్తానని, వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్‌ఈలు కామేశ్వరరావు, కేడీపీ సూర్యనారాయణ, విశ్రాంత ఉద్యోగులు దాడి గంగాధరరావు, జి.రామారావు, వంకినేని బాబురావు, చిలకలపల్లి కట్లయ్య తదితరులు ఉన్నారు.

చెంచుల కాలనీ రోడ్డు అభివృద్ధి చేయాలి



ఏలూరు రూరల్: సుంకరవారితోటలో చెంచులకాలనీ రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. సుంకరవారితోట చెరువు నుంచి కాలనీకు వెళ్లే దారిలో పంటకాలువ రోడ్డు ఎంతో కాలంగా అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతుకులమయమైన రోడ్డుపై ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. వర్షాకాలంలో రోడ్డు మరింత అధ్వానంగా ఉంటుందని, పూర్తిస్థాయిలో వీధిలైట్లు లేక రాత్రివేళ రాకపోకలు ప్రమాదకరంగా మారాయని చెబుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్డు వెడల్పు చేయడంతో పాటు సీసీరోడ్డుగా అభివృద్ధి, వీధిలైట్లు వేయాలని కోరారు.

ప్రజల వద్దకు పాలన సీఎం జగన్ ఘనతే

- ఎమ్మెల్యే ఆళ్ల నాని
- 15వ డివిజన్‌లో 86వ రోజు 'గడపగడపకు మన ప్రభుత్వం'



ఏలూరు 15వ డివిజన్‌లో ఇల్లు మంజూరైందా అని మహిళను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నాని,



వీధిలోని సమస్యలను ఎమ్మెల్యే నానికి వివరిస్తున్న మహిళ

ఏలూరు టౌన్: దేశంలో తొలిసారిగా ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరులో 86వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం చేపట్టారు. ఏలూరు వన్‌టౌన్ ఆముదాల అప్పలస్వామి కాలనీ, దక్షిణపువీధి స్కూల్ వద్ద నుంచి ఎమ్మెల్యే నాని పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి పథకాల అమలుపై ఆరా తీశారు. కార్పొరేటర్ తంగెళ్ల రాము ఆధ్వర్యంలో డివిజన్ నాయకులు, ప్రజలు ఎమ్మెల్యే నానికి సాదరస్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక లోపంతో ఏదైనా పథకం అందకపోతే వాటిని పరిష్కరించి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవ్వా, తాతలను పింఛన్ అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. అమ్మఒడి, డ్వాక్రా రుణమాఫీ ఆసరా అందిందా తల్లీ అంటూ అడిగారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్వరాజ్య స్థాపనకు శ్రీకారం చుడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ తీసుకొచ్చారని, పాలనను ప్రజలకు మరింత చేరువ చేశారని వివరించారు. ఇంటికి సమీపంలోనే ప్రజలకు ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చారన్నారు. ప్రతి ఇంటికీ వలంటీర్లు వచ్చి పథకాలను లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ నాయకులు మధ్యాహ్నపు బలరాం, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, మాజీ చైర్మన్ మంచెం మైబాబు, కార్పొరేటర్లు నున్నా స్వాతి శ్రీదేవి, జిజ్జువరపు విజయ నిర్మల, నాయకులు బందారు కిరణ్‌కుమార్, లక్కోజు గోపి, లుటుకుర్తి సుభాష్, ఏఎంసీ డైరెక్టర్ మేతర సురేష్, పిట్టా ధనుంజయ్, బాలత్రిపుర సుందరి, భోగిశెట్టి పార్వతి, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తహసీల్దార్ బి.సోమశేఖర్, పీఓ కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'కు సన్నాహాలు



ఎస్ఎంఆర్ నగర్‌లో నాయకులకు కండువా కప్పుతున్న మేయర్ నూర్జహాన్, చిత్రంలో ఎస్ఎంఆర్ పెదబాబు



ఏడో డివిజన్‌లో మాట్లాడుతున్న సాహిత్య అకాదమి చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, చిత్రంలో కార్పొరేటర్ శ్రీదేవి



రజకులపేటలో మాట్లాడుతున్న కార్పొరేటర్, జోన్-3 ఇన్‌చార్జి తుమరాడ స్రవంతి

ఏలూరు టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు వినూత్న రీతిలో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారని నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఏలూరు నగరంలో సన్నాహక కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. 50వ డివిజన్‌లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం ఎస్ఎంఆర్ నగర్‌లో ఏర్పాటుచేశారు. మేయర్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు హాజరై వారికి దిశానిర్దేశం చేశారు. పార్టీ వైఎస్సార్‌సీపీ ఆదేశాల మేరకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు డోర్ పోస్టర్లు, మొబైల్ స్టిక్కర్లు వంటి ప్రచార సామగ్రిని అందజేసి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. గత ప్రభుత్వాల పాలన కంటే వైఎస్ జగన్ సంక్షేమ పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరించడంతో పాటు సంక్షేమ పథకాల పంపిణీలో వ్యత్యాసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజా మద్దతు పుస్తకంలో ప్రశ్న పత్రాన్ని సంబంధిత గృహ యజమాని అనుమతితో పూర్తి చేయాలన్నారు. గౌరవంగా వ్యవహరిస్తూ ప్రజలతో మాట్లాడాలని సూచించారు. ప్రజలతో మమేకమవుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్లు గవరపేట నాయుడు, మానుకొండ శ్రీను, బి.బంగారమ్మ, సీహెచ్ కిరణ్, స్థానిక నాయకులు ఉన్నారు.

మా నమ్మకం నువ్వే జగనన్న

ఏడో డివిజన్‌లో రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి నాయకత్వంలో జగనన్నే మా భవిష్యత్ సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ మోటమర్రి సదానందం ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు ఈ 14 రోజులు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటికీ వైఎస్సార్‌సీపీ గృహసారథి వెళ్లి ప్రజలను సందర్శించేలా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారని చెప్పారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఈ 14 రోజుల్లో రాష్ట్రంలోని 1 కోటి 50 లక్షల గృహాలను పార్టీ ప్రతినిధులు సందర్శించేలా కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు.

క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

46వ డివిజన్ రజకుల పేటలోని 19వ సచివాలయంలో మా భవిష్యత్ నువ్వే జగనన్న కార్యక్రమం ప్రారంభం నేపథ్యంలో గురువారం సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్, జోన్-3 సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి తుమరాడ స్రవంతి నాయకత్వంలో 46వ డివిజన్ కార్పొరేటర్ అయేషాసుల్తానా, పార్టీ మైనార్టీ నాయకులు రియాజ్ అలీఖాన్ ఆధ్వర్యంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టబోయే మా భవిష్యత్ నువ్వే జగనన్న కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ప్రజల ప్రతిసమస్యను గుర్తించి దాన్ని అధికారులు, ప్రభుత్వం దృష్టికితీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్ పర్సన్ మేరీగ్రేస్ కుమారి



ఏలూరు (టూటౌన్): ఆశావర్కర్లు ప్రజలకు ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారంపై అవగాహన కల్పించాలని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్ పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవన్‌లో గురువారం ఏలూరు పరిధిలోని ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీగ్రేస్ కుమారి మాట్లాడుతూ ఈ నెల 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ఆశా వర్కర్లు ప్రజలకు ఆరోగ్య విషయాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ఉండాలని సూచించారు. తమ పనిలో ఏమైనా సమస్యలుంటే ప్రజాప్రయోజన సేవల శాశ్వత న్యాయపీఠాన్ని సంప్రదించాలన్నారు. న్యాయపీఠం ద్వారా బడుగు, బలహీన వర్గాల వారికి ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తారని చెప్పారు. జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మనోరమ మాట్లాడుతూ ప్రతి రోజూ ప్రజల ఆరోగ్య పరిరక్షణపై సర్వే నిర్వహిస్తామని, వ్యాధులను గుర్తించిన ఆశా వర్కర్ ద్వారా చికిత్స అందజేస్తామని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఎవరైనా కనబడితే తమ ఆరోగ్య కేంద్రాలకు లేదా జిల్లా ఆసుపత్రుల నిర్వహణ డాక్టర్లకు తెలియజేసి తక్షణం చికిత్స అందజేయాలని ఆశా వర్కర్లకు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కూన కృష్ణారావు, పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ఏలూరు (టూటౌన్): బీజేపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక అశోక్ నగర్‌లోని జిల్లా కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు కార్యకర్తలకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొర్లప సుధాకర కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ విశ్వ నాయకుడిగాపేరు తెచ్చుకున్నారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కట్నేని కృష్ణ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు నగరపాటి సత్యనారాయణ, ఏలూరు అసెంబ్లీ కన్వీనర్ గాది రాంబాబు, కోకన్వీనర్ బాడిత నారాయణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక శాంతి నగర్‌లోని బీజేపీ పశ్చిమ మండల కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు నడపన దాన భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కొర్లప సుధాకర్ కృష్ణ, రాష్ట్ర నాయకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి పాల్గొని మాట్లాడారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రచారం



మాదేపల్లిలో సంక్షేమ పథకాలను తెలుసుకుంటున్న మహిళలు



మాదేపల్లిలో మా నమ్మకం నువ్వే జగన్ కరపత్రాలను ప్రదర్శిస్తున్న పార్టీ నాయకులు

ఏలూరు రూరల్: 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలన చూడండి.. అభివృద్ధి, సంక్షేమం మీ ఇంటికి చేరితేనే రానున్న ఎన్నికల్లో పట్టం కట్టండి' అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఏలూరు మండల గ్రామాల్లో గురువారం 'మా నమ్మకం నువ్వే జగన్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, పార్టీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్, కొల్లేరు నాయకుడు ముంగర సంజీవ్ కుమార్ మల్కాపురం, మాదేపల్లి, తిమ్మారావుగూడెంతో పాటు మొత్తం 15 గ్రామాల్లో పర్యటించారు. గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకుని పార్టీ ముద్రించి కరపత్రాలు, బ్యాడ్జ్, స్టిక్కర్స్ అందించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పాలనను ప్రజలకు వివరించేందుకే మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టామన్నారు. నారా చంద్రబాబునాయుడు హయాంలో తుంగలో తొక్కిన వాగ్దానాలు, జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఎంపీపీ శ్రీనివాసరాజు మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో చేపట్టిన అభివృద్ధి పనులు గ్రామాల్లో ప్రతి ఇంటికీ చేరాయన్నారు. ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టించాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడంతో పాటు అబ్బయ్య చౌదరి ఎమ్మెల్యేగా గెలిపించుకోవడమే కార్యకర్తలు లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో గృహ సారథుల మండల కన్వీనర్ గుర్రం శివ, సర్పంచ్‌లు పత్యాల సునీత, గుడిపూడి రఘు, కొరపాటి శ్రీరామ్‌ప్రభుదేవ్, వర్రి లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మ తిరునాళ్ల ప్రారంభం

పెదవేగి: రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మ ఐదు రోజుల తిరునాళ్లను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కలశ స్థాపన చేసి గురువారం ప్రారంభించారు. తొలిరోజు అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరాట్నాలమ్మ తల్లిని దర్శించుకునేందుకు జిల్లా నుంచే కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు తరలివస్తారని దేవస్థాన చైర్మన్ వెంకటేశ్వరరావు చెప్పారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	16

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	32
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	31
ఏలూరు - బెంగళూరు	14.00	4021	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	34

పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



పాతబస్టాండ్ సమీపంలో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో పారిశుధ్యం నిర్వహణకు చర్యలు చేపట్టినట్టు కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ అన్నారు. తమ్మిలేరు ఏటిగట్టు, కృష్ణా కెనాల్ ప్రాంతాల్లో కాలువలో చెత్త, వ్యర్థాలను వేస్తూ కాలుష్యకుహారాలుగా మార్చివేస్తున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు గురువారం కమిషనర్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని వ్యాపారులు రోడ్లపైన, డ్రెయినేజీల్లో, తమ్మిలేరు, కృష్ణా కాలువల్లో చెత్త, వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పారవేస్తున్నారని, దీన్ని అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని చెప్పారు. కృష్ణా కాలువ, తమ్మిలేరులో వ్యర్థాలు పేరుకుపోవడంతో కార్మికులు ఎంత శ్రమించినా ఫలితం లేకుండా పోతుందన్నారు. ఈనేపథ్యంలో పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయబోతున్నట్టు చెప్పారు. చెత్త వ్యర్థాలను వేసేవారిని గుర్తించి భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. నగరంలో ఇప్పటికే 15 ప్రాంతాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వ్యాపారాలు, రోడ్లపై బండ్లు, చిరువ్యాపారులకు కమిషనర్ అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించకపోతే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. కమిషనర్ వెంట ఎంఈ భాస్కరరావు, ఏఈలు ఎన్.రామారావు, రఫీ తదితరులున్నారు.

కళాశాలకు భవనం లేకపోవడం దురదృష్టకరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటగిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2008వ సంవత్సరంలో ఏర్పాటు చేసినా నేటికీ సొంత భవనం లేకపోవడం దురదృష్టకరమని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి పేర్కొన్నారు. కాలేజీ విద్యార్థి పాసల దుర్గా ప్రసాద్ అధ్యక్షతన గురువారం ఏలూరు మర్చంట్ ఛాంబర్ కల్యాణ మండపంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత భవనాల సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. సాబ్జి మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీను మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆళ్ల నానితో మాట్లాడి సమస్య పరిష్కారానికి తోడ్పడతానన్నారు. వైఎస్సార్ స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకులు శివరాజ్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, టీడీపీ నేత చొడే వెంకటరత్నంలు మాట్లాడారు. పీడీఎస్‌యూ, ఐలూ, ఎస్సీ ఎస్టీ రై ట్స్ అసోసియేషన్, హేలాపురి బాలోత్సవ సంఘం, ఏఐటీయూసీ, ఇఫ్టూ నాయకులు పాల్గొన్నారు.